# ఇంటర్వెల్

-సి. శశిరామ్



''ఏంటండీ ఈ పాడు అలవాటు? ఎప్పుడూ నోటి నిండా సోంపు. చెప్పి చెప్పి నా నోరూ అరిగిపోతోంది కాని ఫలితం శూన్యం.''




"ఏం చెయ్యనూ? ప్రయత్నిస్తూనే ఉన్నాను కదా? అయినా ఎప్పుడూ ఇది వద్దు, అది వద్దు అని నా ప్రాణం తీయటమేనా నీ పని? పెళ్ళి కాగానే ఛీ! పాడు వాసన అని మొదలుపెట్టి కాన్సరు వస్తుందని చెవిలో జోరీగలాగా పోరు పెట్టావు. ప్రాణంతో సమానమైన సిగరెట్స్ మానాలంటే ఎంత కష్టపడాల్సి వచ్చిందో నీకేం తెలుసు? ఇప్పటికీ నాకు ఆశ్చర్యమే ఎలా మానగలిగానా అని? తరువాత నా కిళ్ళీపై పడ్డావు. అదీ మంచిది కాదు కాన్సరు వస్తుందని. దానిని మానటానికి వక్కలు, చాక్లెట్లు అలవాటు చేసుకోక తప్పింది కాదు. మళ్ళీ వక్క లెంబడి పడ్డావు. అవి మంచివి కావని నా ప్రాణాలు తోడావు. వక్కల బదులు సోంపు తినండి అని వీటిని నీవే ఇచ్చావు. ఇప్పుడేమో అదీ వద్దంటున్నావు. నీకేం తెలుసు ఉన్న అలవాటును మానాలంటే ఎంత కష్టమో?'' ఎంత నెమ్మదిగా మాట్లాడుదామన్నా అతని అంతరంగంలో కోపాగ్ని ప్రజ్వరిల్లుతోంది.

''మరెందుకు అలవాట్లకు బానిసలవుతారు? మొదలు పెట్టక మునుపే ఆలోచించాలి. ఇది ఆరోగ్యానికి మంచిదా కాదా? అని మేకపోయి తోక వచ్చె డాం డాం డాం, తోకపోయి ఈకవచ్చె డాం డాం డాం అన్నట్లు, ఒక అలవాటు మాన్పించేసరికి ఇంకొక అలవాటు రడీ. నా ప్రాణాలు పోతున్నాయి మీకు చెప్పలేక. మీ అలవాట్లు మాన్పించాలంటే నా జీవితమంతా గడిచిపోయేటట్లుంది'' అంది నిష్ఠూరంగా భర్తతో రచన.

''చూడు రచనా నేనూ అదే అంటున్నాను. నా వెంట పడకు, ప్రపంచంలో నాకొక్కడికే ఈ అలవాట్లు ఉన్నట్టు. కిళ్ళీ వద్దు, సిగరెట్స్ వద్దు, వక్కలు వద్దు, చాక్లెట్లు వద్దు, సోంపు వద్దు. ఇలా కొన్ని రోజులు పోతే తిండి వద్దు, గుడ్డవద్దు, నిద్రావద్దు, చివరికి గాలి కూడా పీల్చవద్దు అందులో క్రిములుంటాయి కాన్సరు వస్తుంది అంటావేమో?''

''ఛ, చాల్లేండీ ఎవరైనా వింటే నవ్విపోతారు. నేను మీ శత్రువు నటండీ? నే చెప్పేది మీ మంచి కొరకేనని మీకు తెలుసు. మీ అలవాట్లు దురలవాట్లని తెలుసు. తెలిసి ఎందుకు నాతో చెప్పించుకుంటారు. మీలాంటి వాళ్ళ కొరకే ప్రభుత్వం న్యూస్ పేపర్లలో, టివీలలో చూపిస్తున్నారు అవి మంచివి కావని. కాని ఏం లాభం చెవిటి వాడి ముందు శంఖుమ్రోగించినట్టే'' నసిగింది రచన.

> ''అయితే ఆ నిష్కామ సేవా నేనూ పిల్లలు కూడా చేయచ్చా? చెప్పండి ఈ రోజు నుండే అందరం సిగరెట్స్ త్రాగుదాం''

''నిజంగా ప్రభుత్వానికి సమాజాన్ని బాగు చేయాలనుంటే వాటిని టోటల్‌గా బ్యాన్ చేస్తుంది. కాని చేయదు. వాటిని తయారు చేయటానికి పరిమిట్లు ఇచ్చిందంటే అవి వాడమని అర్థమే కదా? అవి బాగా ప్రజలలో అలవాటు అయినంత వరకు వేచి చూచి అప్పుడు అవి మంచిది కాదు ఆరోగ్యానికి, వాడకండి అని ప్రచారానికి లక్షలు ఖర్చుపెడితే ఏం లాభం? ఇది ప్రభుత్వపు డబుల్ గేమ్. ఇటు ఆదాయపు పన్ను ద్వారా కోట్లు సంపాదించి ప్రచారానికి లక్షలు ఖర్చు పెడతారు. అంతేకదా? ఒక రకంగా చూస్తే మేము ప్రభుత్వానికి కోట్ల లాభం చేస్తున్నామన్న మాట. మాది నిష్కామ సేవ తెలుసా?''

''అయితే ఆ నిష్కామ సేవా నేనూ పిల్లలు కూడా చేయచ్చా? చెప్పండి ఈ రోజు నుండే అందరం సిగరెట్స్ త్రాగుదాం'' వెటకారంగా జవాబిచ్చింది రచన భర్తకి.

''నీ కొరకు నేను మా ఫ్రెండ్స్ సర్కిల్‌లో నవ్వుల పాలయ్యాను తెలుసా? గంగిరెద్దులా నీ మాట విని సిగరెట్స్ మానినందుకు. రోహిత్ ఎంత చక్కగా, ఠీవిగా అలా ... అలా ... అలలు అలలుగా పొగను రింగులుగా వదులుతూ మేఘాలు సృష్టించే వాడు పాపం భార్యకి భయపడి సిగరెట్స్ త్రాగటం మానివేశాడని వాళ్ళు అన్నారు తెలుసా?'' ఎంతో త్యాగం చేసిన వాడిలా అన్నాడు.

''ఇవాళిటి నుండి వారిని మీ ఫ్రండ్స్ అనుకోకండి. మీ ఫ్రెండ్సయితే మీ క్షేమం కోరి మీరు సిగరెట్స్ మానినందుకు సంతోషపడేవాళ్ళు. వారికి ఏ కొంచెం బుద్ధి ఉన్నా మీరు చేసిన పనికి హర్షించేవారు. మీరు సిగరెట్స్ మానినందుకు మేఘాలు లేక మన రాష్ట్రంలో అనావృష్టి వస్తుంది. మీ బదులు నారిని రెట్టింపు సిగరెట్స్ త్రాగమనండి చూద్దాం'' ముక్కు పుటాలెగరేస్తూ సమాధానమిచ్చింది.

''మా ఫ్రెండ్స్‌నేమి అనకు.''

''ఏం చేస్తారేంటీ?''

''మళ్ళీ సిగరెట్స్ త్రాగటం మొదలు పెడతాను.''

''చాల్లేండి. ఇక ఆ ప్రసక్తి ఎత్తకండి. మన బంగారం మంచిదయితే వారినని ఏమి లాభం నా బుద్ధి తక్కువయి కాని.''

''నేను బుద్ధిమంతుడ్ని కాబట్టి సరిపోయింది. నీవు చెప్పినట్టు వింటున్నాను. బయట ప్రపంచంలోకి తొంగిచూడు. పురుషులు కిళ్ళీ, సిగరెట్స్, వక్కలు, గుట్కా, త్రాగుడు, వ్యభిచారం ...''

చాల్లేండి పురుషుల భారతం విప్పకండి, నాకు ఒళ్ళు మండుతుంది'' మధ్యలోనే అందుకుని భర్త మాటలు త్రుంచివేసింది.

''వక్కలు మానాలని సోంపు తినమన్నాను కాని సంచుల కొద్ది సోంపు, పాకెట్స్ కొద్ది చాక్‌లెట్స్ తింటారుటండీ? ఎప్పుడూ నోరు కదపడమే చూడలేక చస్తున్నాం. ప్రతిదీ నేను చెప్పాలా? స్వతహాగా మీకుండాలి. అయినా మిమ్మల్ని అని ఏం లాభం? ఆ భగవంతుడే పురుషులకి ఆలోచించే శక్తి తక్కువ, సమర్థించుకునే శక్తి ఎక్కువ ఇచ్చాడు'' మెల్లిగా అంది.

''ఏం అంటున్నావు?'' కోపోద్రిక్తుడయ్యాడు రోహిత్.

''అనక ఏం చేయను? సిగరెట్స్, పొకలు కాన్స

రోకి పిలుపని తెలియదా? గుట్కా ఎంత మహమ్మారో తెలియదా? త్రాగుడు ఇల్లు, ఒళ్ళు గుల్ల చేస్తుందని తట్టదా? తెలిసీ పురుషులెందుకు వ్యసనాలకి బానిసలవుతున్నారు?''

''ప్లీజ్ రచనా ఇక నీ లా పాయింట్స్ ఆపు. రామాయణం మొదలు పెట్టావంటే ఒక పట్టాన ఆపవు. కామా, ఫుల్‌స్టాపు లేకుండా మాట్లాడగలుగుతావు పురుషుల వ్యసనాల గురించి'' రాజీపడే ధోరణిలో రెండు చేతులెత్తి దండం పెడుతూ అన్నాడు.

''సరేలెండి నాకేం పనిలేనట్టు మీ వెంటపడినట్టు మీ ఉద్దేశం. చివరిసారిగా చెబుతున్నా ఇక ముందు నుండి ఏ కొత్త అలవాటూ దరికి రానీయకండి మీకు పుణ్యముంటుంది.''

''క్రొత్త అలవాటుకూ పుణ్యానికీ ఏం సంబంధం'' అమాయకంగా అడిగాడు.

''ఛ, ఊరుకోండి. ఇక ఏ అలవాటు దగ్గరికి రానిచ్చినా ఊరుకునేది లేదు'' ఘంటాపథంగా చెప్పింది తన నిర్ణయం.

''ఊరుకోక ఏం చేస్తావేంటీ?''

''ఏం చేస్తానా చూద్దురుగానీ, ఎంచక్కా గుట్కా అలవాటు చేసుకుంటాను. అప్పుడు మీరు నా వెంట పడతారు. రచనా మానెయ్యి ఆరోగ్యానికి మంచిది కాదని'' అమాయకంగా ఫోజుపెట్టి జవాబిచ్చింది రచన.

''చాల్లే సూర్యుడు పడమర ఉదయించవచ్చు, నీరు పల్లం నుండి పైకి ప్రవహించవచ్చు, భూమి తల క్రిందులవ్వచ్చు. కాని నీవు గుట్కా అలవాటు చేసుకోవటం మాత్రం అసాధ్యం. నీ సంగతి నాకు తెలియదా?'' కొట్టి పారేశాడు. భర్తకు తన పట్ల ఉన్న నమ్మకానికి క్షణం గర్వంగా ఫీలయింది కాని వెంటనే భయపడింది. ఎందుకు తాను గుట్కా సంగతి లేవదీస్తోంది. కొంపదీసి భర్త గుట్కా అలవాటు చేసుకుంటే? ఆ ఆలోచనకే నిలువునా వణికిపోయింది ఆమె హృదయం. భగవంతుడా కాపాడు అతనిని దాని బారినుండి అని ప్రార్థించింది మనసులోనే.

❀❀❀

''**ఏ**మండీ వారం నుండి చూస్తున్నాను. అలా ఒళ్ళు విరుస్తున్నారెందుకు?''

''ఒళ్ళు విరవడమంటే'' అడిగాడు భర్త.

అదే మీరు చేస్తున్న పని. రెండు చేతులు పైకెత్తి ఛాతీని ముందుకు అంటున్నారు మాటిమాటికి. దానినే ఒళ్ళు విరుపు అంటారు'' అర్థం చేయించింది రచన భర్తకి.

''అదా సంగతి. దానికి అంత హైరానా పడటమా? అది ఏమైనా ఆరోగ్యానికి హానికరమా? లేక అది ఒక దురలవాటా?

''హానికరమైంది కాదనుకోండి. అయినా అప్పుడప్పుడు మీరు అలా అంటుంటే బాగుండదండి నలుగురిలో. అదే అలవాటుగా మారేటట్టు ఉంది'' జంకుతూనే సందేహం వెలిబుచ్చింది.

''ఏం వర్రీ అవకు. ఎందుకు నేను అలా అంటున్నానో నాకే తెలియదు. అదిమానటం కష్టం కాదు. బీ హాపీ'' అని బుజ్జగించాడు. అయినా రచనకి నమ్మకం కలగలేదు - ఆ అలవాటు అంత తొందరగా అతనిని వీడిపోతుందని.

❀❀❀

''**ర**చనా త్వరగా రడీ అవు పిక్చర్‌కి టికెట్స్ తెచ్చాను'' బయట నుండే కేక వేస్తూ వచ్చాడు రోహిత్.

''ఏం సినిమానండీ? 'తాళ్ యేనా'' సంతోషంగా కిచన్‌లో నుండి పరిగెత్తుకుని వచ్చి భర్త ఒళ్ళు విరవటాన్ని చూసి నీరుకారిపోయింది.

కాని తాళ్ సినిమా అనగానే సంతోషంతో ఎగిరి గంతేసినంత పని చేసింది.

''ఐశ్వర్యరాయ్ అందాలు, సొగసులు, ఆమె డాన్స్, పాటలు, అక్షయ్‌ఖన్నా అమాయకత్వం ఒకటేమిటి అన్నీ బాగున్నాయటండీ'' తయారవుతున్నంత సేపూ ఆ పిక్చర్ గురించి మాట్లాడుతూనే ఉంది.

❀❀❀

**ఇం**టర్‌వెల్‌లో కూల్‌డ్రింక్స్ కొరకు ఇద్దరూ క్యాంటీన్‌కెళ్ళారు. రోహిత్ తొందరగా త్రాగి లోపలికి వెళ్ళిపోయాడు. అతనికి తెలుసు రచన కూల్‌డ్రింక్స్‌కు చాలా టైము తీసుకుంటుందని. రచన తన డ్రింకు ముగించి హాలు లోపలికి అడుగు పెట్టింది. చుట్టూ కలియజూసింది. లైట్స్ ఆఫ్ అయి వున్నాయి. అందరూ పిక్చర్ చూడటంలో నిమగ్నమై ఉన్నారు. ఒక్కసారి గుండె జల్లుమంది. తనది ఏ వరుసనో ఏ సీటు నంబరో కూడా తెలియదు. పిక్చర్‌కి రోహిత్ వెంట వచ్చింది. వచ్చేసరికి లేట్ అయినందున పిక్చర్ మొదలయింది. చీకట్లో టార్చ్ అబ్బాయి చూయించగా తమ సీట్లలో వెళ్ళి కూర్చున్నారు. కాని ఏ నంబరో తెలియదు. ఇప్పుడేమి చేయాలో పాలుపోవటం లేదు. టార్చి అబ్బాయి వస్తే బాగుండు అనుకుంది. కాని అంతలో ముచ్చెమటలు పట్టాయి. అతను వచ్చి సీటు నంబరు అడిగితే ఏమి చెప్పేది? పల్లెటూరు మోహం ఇవాళే పిక్చరుకు వచ్చిందనుకుంటాడు. ఇలా పరిపరి విధాలా ఆలోచించసాగింది. ఎప్పుడూ ఇలా కాలేదు. ఛీ, పిక్చర్ అంటే చిన్నపిల్లలా ఆయన వెంటపడి వెళ్ళి కూర్చుంది. మళ్ళీ హాల్ అంతా కలియజూసింది. మిరాకిల్‌లాగా ఒకతను రెండు చేతులు పైకెత్తి ఒళ్ళు విరవటం ఆమెకి కనబడింది. అంతే ఎడారిలో నది కనబడినంత ఆనందం. గబగబా పరిగెత్తినట్టు నడిచి వెళ్ళి తన సీట్లో కూర్చుంది. పక్కకి మరలి చూసింది ఇంతకు తాను కూర్చుంది కరెక్టు కుర్చీనేనా? అని. ప్రక్కన భర్తని చూసి హమ్మయ్య అనుకుంది. ఎందుకింత లేటయిందని అడగటం కూడా లేదు. చిన్న పిల్లాడిలా సినిమాలో నిమగ్నమయి ఉన్నాడనుకుంది. ఏమైనా అతని అలవాటే తనకి ఆ సమయంలో మార్గదర్శకమైందని నవ్వుకుంది. అయినా వదలద్దు రేపటి నుండి వెంటపడి మాన్పించాలి అని దృఢ నిశ్చయం చేసుకుని సినిమా చూడటంలో నిమగ్నమయింది రచన.

